క్లుప్తంగా

15న భట్టిప్రోలులో 'రచ్చబండ'

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో 15వ తేదీన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు అధ్యక్షతన రచ్చబండ జరుగుతుందని పార్టీ మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామాల కన్వీనర్లు, నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభిమానులు పాల్గొనాలని అన్నారు.

పేరలిలో ఉచిత దంతవైద్య శిబిరం



పేరలి(బాపట్ల): గ్రామంలో పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన ఉచిత దంతవైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. డాక్టర్ హనుమంతరావు బృందంతో ఆదివారం ఉదయం నుంచి ఉచిత దంతవైద్య శిబిరాలను నిర్వహించారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఏపూరి భూపతిరావు, చింతాయపాలెం పీఏసీఎస్ చైర్మన్ మద్దిబోయిన బుల్లియ్య, దర్శి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, సుభాని తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్తీ మద్యంపై ర్యాలీ

వేమూరు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు నకిలీ మద్యంపై వేమూరులో సోమవారం ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు దాది సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైల్వే గేటు వద్ద నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని తెలిపారు. నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కదిలి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

రామనామ క్షేత్రంలో సింహద్వారోపణం




అద్దేపల్లి(భట్టిప్రోలు): గ్రామంలోని శ్రీరామనామ క్షేత్రంలో శ్రీ సీతారామ కల్యాణ వేదిక నిర్మాణం కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ తూర్పు, ఉత్తర సింహ ద్వారోపణం జరిగింది. సంఘం అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రూ 2.50 లక్షలు, రూ.1.50 లక్షలతో ద్వారాలను అందజేశారు. నిర్వాహకులు వంశీ, కాగిత దుర్గా ప్రసాద్, కె.ఆంజనేయులు, వేల్పూరి శ్రీనివాసరావు, వి.వీరాంజనేయులు, తిరువీధుల దేవాజీ, బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సార్), బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

వైస్ ఎంపీపీ పిచ్చయ్యశాస్త్రి

భట్టిప్రోలు: చేనేత నాయకులు, సంఘాలకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని భట్టిప్రోలు వైఎస్సార్ సీపీ వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం కంటే అధికంగా నేతన్నలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కూటమి నేతలు నేటివరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండల చేనేత సొసైటీకి రావాల్సిన రూ. 3 కోట్లకు పైగా బకాయిలను చెల్లించాలని, గత 15 రోజులుగా కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం, చేనేత మంత్రి పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. చేనేత పరిశ్రమపై, కార్మికులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నేతన్నలకు ప్రకటించిన రూ. 25 వేలు వెంటనే చెల్లించి ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా భజన కార్యక్రమం



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో ముగ్గురు తల్లుల మూలపుటమ్మలైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవస్థానంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్పస్వామి పీఠం వద్ద అత్యంత వైభవంగా భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు తుళ్లి ఆడి స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. కట్లమ్మతల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీవరకు సద్ది కార్యక్రమం నిర్వహించనున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'రచ్చబండ'



వలివేరులో రచ్చబండలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆలపాడులో జరిగిన రచ్చబండ కార్యక్రమం

చుండూరు(వేమూరు): పేద విద్యార్థులకు ఉపయోగపడే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గాదె శివరామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. చుండూరు మండలం వలివేరులో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివరామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూర దృష్టితో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే.. నేటి కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేస్తూ.. పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, దాట్ల మోహన్‌రెడ్డి, మండల పరిశీలకు గోపాలం రాము, అమర్తలూరు ప్రవీణ్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పందిపాటి వెంకయ్య, గ్రామ పరిశీలకు అంగిరేకుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సీహెచ్ సాంబరెడ్డి, బూత్ కన్వీనర్ దాసరి వసంతరావు, నూతలపాటి శ్రీనివాసరావు, బి.సాంబయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలపాడులో...

చుండూరు(వేమూరు): మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కూచిపూడి లెనిన్ రత్నబాబు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. నాయకులు విప్పర్ల సుధాకర్, కూచిపూడి బుజ్జిబాబు, చిక్కాల ఏసుబాబు, మెరుగామాల అంబేడ్కర్, కూచిపూడి లక్ష్మణరావు, అత్తోట చిన వందనం తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో క్యాన్సర్ అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు నీలం రాజు హరీష్

భట్టిప్రోలు: జీవన విధానం, ఆహార వ్యవహారాల్లో మార్పులతో క్యాన్సర్ బారినుంచి తప్పించుకోవచ్చని వైద్యులు నీలం రాజు హరీష్, హరితలు పేర్కొన్నారు. కాంటినెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ డిజిటల్ రూమ్‌లో ఆదివారం క్యాన్సర్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి ప్రధాన కారణం జీవన విధానం, ఆహార వ్యవహారాలేనన్నారు. పూర్వం మన ఆహార వ్యవహారాలు ప్రకృతికి దగ్గరగా ఉండేవని, భుజించే ఆహారం హితమైందిగా, మితమైందిగా ఉండేదని, కానీ నేడు ఆహార వ్యవహారాల్లో విపరీత పోకడల మూలంగా క్యాన్సర్ వస్తుందన్నారు. ముఖ్యంగా స్త్రీలు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. హెచ్ఎం సీహెచ్ రామకోటేశ్వరరావు, ఆయుర్వేద వైద్యులు దీవి వేంకట నాగశేషాచార్యులు, తెలుగు పండిట్ ముద్దా లీలామోహన్‌రావు, డాక్టర్ ఎస్.హరీష్‌బాబు, రావూరి సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించండి

తాడేపల్లి రూరల్: నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలను అధికారులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల విస్తృత సమావేశాన్ని తోట కృష్ణకుమారి అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గుడ్లు ఉడకబెట్టినందుకు, జావ కాచినందుకు అదనంగా డబ్బులు ఇస్తామని అక్షయపాత్ర వారు చెప్పారని, ఇప్పటిదాకా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగా దుర్గారావు, అధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా కృష్ణకుమారి, కోశాధికారిగా సలోమిని, మరో 10 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్మికులు మరియమ్మ, బాలకోటమ్మ, శేషుకుమారి, రత్నకుమారి, ఫ్రాన్సిస్, షాహిన, రాజేశ్వరి, సామ్రాజ్యం, గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యల్ని నిర్లక్ష్యం చేయవద్దు



మాట్లాడుతున్న డాక్టర్ తేజస్విని

గుంటూరు మెడికల్: వయసుతో నిమిత్తం లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని మానసిక వైద్య నిపుణులు కె.ఎల్.తేజస్విని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కేఎల్ తేజస్విని మాట్లాడుతూ యువతలో ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు పెరిగిపోతున్నాయని చెప్పారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే విధంగా పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వయస్సు, ఎత్తును బట్టి శరీర బరువును కలిగి ఉండడం, ఆహార నియమాలు, శారీరక వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యధిక శాతం మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గాజుల లక్ష్మీనారాయణ, డాక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి, తూబాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

104 ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు లక్ష్మణరావు

లక్ష్మీపురం: 104 మొబైల్ మెడికల్ యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ బకాయిలు తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆదివారం పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశం కు జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 నిర్వహణకు సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్నటువంటి అరబిందో సంస్థ ప్రతి ఒక్క ఉద్యోగికి ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్లు చేయకపోవడం సరైనది కాదన్నారు. కొత్త సంస్థ అయిన భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఇప్పటికీ ఏ ఉద్యోగికి పేస్లిప్ ఇవ్వలేదన్నారు. ఎందుకు వేతనాలలో కోత విధిస్తున్నారు అర్థం కావటం లేదని ఎప్పటికైనా ప్రతి ఉద్యోగికి పేస్లిప్ ఇవ్వాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు జరగాలని అన్నారు. ప్రతి ఉద్యోగికి పది లక్షలు బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల సురేష్ కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు అమలయ్యేటటువంటి సీవు లీవులు, ఎర్న్ లీవులు, పబ్లిక్ హాలిడేలు, గుర్తింపు కార్డులు, పెరిగిన ధరల కనుగొనంగా వేతనాల పెంపు చేయాలని, ప్రతి స్లాబ్ లో ఉన్న ఉద్యోగికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలూరి శ్రీహర్ష, ఐ నాగులు, బాలకష్ణ, సత్యరాజు, విజయ్ కుమార్, సురేష్, సాయిరాం, సుబ్బారావు, అమర్చంద్, సూర్యనారాయణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ సంకల్పమే దేశాభివద్ధికి పునాది

గుంటూరు మెడికల్: ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారతీయుని జీవిత ధ్యేయంగా మారాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి అన్నారు. ఆదివారం గుంటూరు లాల్‌పురం రోడ్డు లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ''ఆత్మనిర్భర్ భారత్ జిల్లా స్థాయి కార్యశాల''లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన రైతు స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహిస్తేనే భారతం నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుందన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఆధార పడకుండా, మన భారతీయ సాంకేతికత, మన విత్తనాలు, మన యంత్రాలు, మన శ్రమ - ఇవే మన బలమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రాజు, బిట్రా శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జూపూడి రంగరాజు, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, పొగాకు బోర్డు చైర్మన్ సి.హెచ్.యశ్వంత్, బీజేపీ సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా కన్వీనర్ కిష్టపాటి నారాయణరెడ్డి, కో కన్వీనర్లు మునగపాటి నాగేశ్వరరావు, పొట్టు మూర్తి శ్రీనివాస్, గాథర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సేవకుల దినోత్సవం



భట్టిప్రోలు: దేవుని పరిచర్యలో సేవా భావం కలిగిన సేవకులను సన్మానించుకోవడం అభినందనీయమని పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ పేర్కొన్నారు. ఆదివారం సేవకుల దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలుకు చెందిన నందం వెంకటేశ్వరరావు రవీంద్ర వర్మ-విజయ దంపతులను ఘనంగా సన్మానించారు. సంఘ పెద్దలు కనపర్తి కోటేష్, విక్టర్, రవి వరప్రసాద్, సంఘీయులు జంగం సర్వేశ్వరరావు, లింగం శ్రీనివాసరావు, మంద్రు సతీష్, పెరికల ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాల యుద్ధంపై ప్రభుత్వ మౌనం బాధాకరం

సదస్సులో సీపీఎం నేత కేబీ ప్రసాద్



తెనాలి: 'భారతదేశంపై ట్రంప్ సుంకాల యుద్ధం -ప్రభావం-పరిశీలన-ప్రత్యామ్నాయం' అనే అంశంపై స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సీపీఎం నాయకుడు పి.జోనేష్ అధ్యక్షత వహించారు. సీపీఎం తెనాలి పట్టణ కమిటీ కార్యదర్శి కేబీ ప్రసాద్ సదస్సును ప్రారంభించారు. గత ఆరునెలలుగా ట్రంప్ ఏకపక్షంగా దూకుడుగా వ్యవహరిస్తున్నా, దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినప్పటికీ భారత ప్రభుత్వం నిరసన తెలియజేయలేదన్నారు. దీంతో ట్రంప్ మరిన్ని రెచ్చగొట్టే చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. ట్రంప్ విధానాలతో మన వ్యవసాయం దెబ్బతినేలా ఉందన్నారు. పాడిపరిశ్రమ, టెక్స్‌టైల్, తోలు, ఆభరణాలు, ఆక్వా, మందుల పరిశ్రమలు కోలుకోలేని విధంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంతటి తీవ్ర సమస్యపై దేశంలోని రాజకీయ పార్టీలు స్పందించకపోవటం బాధాకరమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సీపీఎం చొరవ తీసుకుని సదస్సు నిర్వహించామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. న్యాయవాది వై.స్టాలిన్, పోస్టల్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, జి.వెంకట సుబ్బయ్య, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళలపై దాడిపై కేసు

తెనాలిరూరల్: స్వల్ప విషయమై మహిళలపై దాడి చేసి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన గోపి తన ఎదురింటిలో నివసించే బాలుడితో స్వల్ప విషయమై ఘర్షణ పడి కొట్టాడు. మధ్యలో అడ్డుకునేందుకు వెళ్లిన బాలుడి తల్లి, నాయనమ్మలపై సైతం దాడి చేసి గాయపర్చాడు. బాలుడి నాయనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్ శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

ఆలోచన మారితే అదే నిజమైన మార్పు

చేబ్రోలు: జీవితంలో ప్రతి సారి బయటకి మార్పు కనిపించకపోయినా, మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు అని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ డీన్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ కుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 'వరల్డ్ మెంటల్ హెల్త్ డే – 2025' వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని 'హీలింగ్ మైండ్స్' అనే థీమ్‌తో నిర్వహించారు. వెంకటేష్ కుమార్ మాట్లాడుతూ మానవ మేధ మూడు స్థాయిలలో పనిచేస్తుందని స్పృహ, ఉపస్పృహ, అవచేతన ఈ స్థాయిలను అర్థం చేసుకున్నప్పుడు భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మార్పులను గుర్తించగల దృష్టి కలిగి ఉండాలని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఘటనలకు కృతజ్ఞత తెలిపే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో 90 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో ఇరుక్కుపోయి సమయాన్ని, ఆరోగ్యాన్ని, ఆలోచనలను వృథా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ముగిసిన చెన్నకేశవుని కళాన్యాస మహోత్సవాలు



వైభవంగా సాగుతున్న చెన్నకేశవుని కళాన్యాస మహోత్సవం

చందోలు(బాపట్ల): చందోలు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి కళాన్యాస మహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం జరిగింది. మూడురోజులుగా చేపట్టిన ఉత్సవాల్లో ఆదివారం శాంతి కళ్యాణం అంత్యంత వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్ర అనుసారముగా 11 మంది వేద పండితులు మూడురోజులపాటు నిర్విరామంగా యజ్ఞయాగాది హోమ క్రతువులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 11:36లకు స్వామివారి కల్యాణ మండప శిఖర ప్రతిష్ఠ అత్యంత వైభవంగా చేపట్టారు. దేవస్థానానికి చుక్కపల్లి వెంకట రఘునాథబాబు రూ.1.16 లక్షల విరాళం అందించారు. దాత చుక్కపల్లి వెంకట రఘునాథబాబును తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, ఎస్సై శివకుమార్, ట్రస్టు బోర్డు చైర్మన్ గుప్తా, ఈఓ నరసింహమూర్తిలు సన్మానించారు. భక్తులు భారీగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మెగా డీఎస్సీలో ఎంపికైనవారికి సన్మానం



నూతన ఉపాధ్యాయులను సన్మానించిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు: డీఎస్సీ-2025 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఘనంగా సన్మానించారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ మెగా డీఎస్సీలో నియోజక వర్గంలోని 60 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయన్నారు. వేమూరు మండలంలో ఆరుగురికి, అమర్తలూరు మండలంలో 12 మందికి, చుండూరు మండలంలో నలుగురికి, కొల్లూరు మండలంలో 13 మంది, భట్టిప్రోలు మండలంలో 25 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొటిపాటి పూర్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు గాజులు వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కవులతో ప్రజల్లో చైతన్యం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

మంగళగిరి టౌన్: సమాజంలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కవులు ముందుంటారని, వారి పాత్ర ముఖ్యమైనదని తెలుగు, సినీ, బుల్లితెర రచయిత మౌనశ్రీ మల్లిక్ అన్నారు. మంగళగిరి పరిధిలోని రాయల్ బాంక్వెట్‌లో ఆదివారం గోలి మధు రచించిన రెండు కవితా సంపుటిల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిక్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో ఫైర్ ఉంటుందని పేర్కొన్నారు. మధు రచించిన ఎదురీత పుస్తకాన్ని ఆంధ్రనాటక కళాసమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. సాహితీ విమర్శకులు రాజా హుస్సేన్ మాట్లాడుతూ గోలి మధు కవిత్వంలో స్పష్టత సూటిగా కనిపిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, మినీ కవితల రచయిత రావి రంగారావు, వీటీజేఎం అండ్ ఐఈటీఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దామర్ల వెంకట నరసింహారావు, పలువురు రచయితలు, కవులు పాల్గొన్నారు. తొలుత మంగళగిరి సాహితీ వేదిక కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

అమాత్యా.. హామీని నెరవేర్చండి



సంఘీభావం తెలుపుతున్న కార్మిక నాయకులు

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు 313 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ ఈ ప్రాంతాన్ని పర్యటించినపుడు కూటమి అధికారంలోకి వస్తే సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, సాంబశివరావు, కార్మికులు నవనీతమ్మ, సుభాని, ఖాసిం, సువర్ణకుమారి, బాషా, సుబ్బారావు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరంలో లబ్ధిదారులను కలసి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 18 వేల మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉన్నారని లోకేష్ తెలిపారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఆయన ఇచ్చిన హామీని మాత్రం నెరవేర్చలేదని విమర్శించారు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్నారని, సొంత ఇంటి స్థలం లేక అద్దెలతో ఆర్థికంగా ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాన్ని మంజూరు చేసి గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో మంగళగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు పల్లెకృష్ణ, షేక్ పాపా సాహెబ్, కారసాల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల స్వీకరణ

ఎన్నికల ముందు కూటమి నాయకులు పేద ప్రజలకు రెండు సెంట్ల స్థలాన్ని ఇస్తామని వాగ్దానం చేశారని, దాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని రామయ్య కాలనీలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల నుంచి అర్జీల స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు వేణు, మల్లీశ్వరి, వేముల దుర్గారావు,లక్ష్మి, గోపి, భాను తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఈనెల 17వ తేదీన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థకార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద సంఖ్యలో పేదలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరినగర పరిధిలోని ఆంజనేయ కాలనీలో ఆదివారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు పెట్టించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, నాయకులు పిల్లల మర్రి బాలకృష్ణ, వై. కమలాకర్, బాలాజీ, శ్రీనివాసరావు, రామారావు, హేమసుందరరావు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో వివిధ పంటలలో విత్తన శుద్ధి ఆవశ్యకతపై అభ్యుదయ రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ కళాశాల, బాపట్ల రావెప్ విద్యార్థినులు మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసేవిధానం చూపిస్తు విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. విత్తన శుద్ధి వలన లేత మొక్క దశలో వచ్చే చీడపీడలను నివారించవచ్చని తెలిపారు.